# వర్కింగ్ జర్నలిస్ట్

సమాచార స్రవంతి

సంపుటి: 13 సంచిక: 6 జూన్ 2024 వెల: రూ. 5/-

# కొలువుతీరిన కూటమి





సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారధి



పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగూరు నారాయణ



వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్ యాదవ్



సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధితో సమాచార శాఖ సిబ్బంది

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 13 జూన్ 2024 సంచిక: 6**


## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| చంద్రబాబు బాధ్యతల స్వీకరణ .............. | 4 |
| కొలువుతీరిన కూటమి ............ | 5 |
| మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారధి ............................... | 7 |
| కేన్సర్ రహిత దిశగా అడుగులు ......................... | 9 |
| ఈనాడు సృష్టికర్త రామోజీ ఇకలేరు ............ | 10 |
| మీడియా హక్కులను కాపాడాలి ........................... | 12 |
| ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై అమెరికాలో ఇంత మోజా! ....................... | 13 |
| హక్కుల సాధనకు సమాయత్తం ................................. | 15 |
| హిందీ పత్రికా దినోత్సవం ---------------- | 16 |
| ఫిల్మ్ జర్నలిస్టు ధీరజ్ అప్పాజీకి పురస్కారం ..................... | 17 |
| మునగపాకలో విలేకరిపై దాడి ....... | 18 |
| సుందరం స్విట్జర్లాండ్ ....... | 20 |



సంపాదకులు

ఎ.అమరయ్య

వర్కింగ్ ఎడిటర్స్

ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్

సంపాదకవర్గం

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| టి.మద్దులేటి | వి.భక్తవత్సలం |
| ఒ.శాంతి | ఎస్.మురళీశంకర్ |
| కె.ఎస్.శంకరరావు | జి. శీనుబాబు |
| డి.మధుసూదనరావు | |

డిజైనర్:


**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi
Sapphire, Golconda 'X' Roads,
Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross
Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9912199494
RNI No. APMUL/2009/37690


# పాత్రికేయుల సమస్యలపై దృష్టి పెట్టండి!

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఎన్డీఏ సారధ్యంలోని తెలుగుదేశం, జనసేన, బిజెపిలు కలిసి ఉమ్మడిగా పోటీ చేసి విజయం సాధించాయి. 175 శాసనసభ స్థానాలకు గాను 164 స్థానాల్లో విజయం సాధించమంటే చిన్న విషయం కాదు. ప్రజాతీర్పు ఊహలకు అందేది కాదని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి. ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన కూటమి ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏ.పి.డబ్ల్యు.జె.ఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఏ.పి.బి.జె.ఎ)లు సంయుక్తంగా అభినందనలు తెలియజేస్తున్నాయి. కూటమి సూపర్‌సిక్స్ పేరుతో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెబుతోంది. ఆచరణలో ఏ మేరకు సఫలీకృతమవుతారనేది చూడాల్సి ఉంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రింట్, బ్రాడ్‌కాస్ట్ మీడియాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ ప్రభుత్వం ప్రయత్నించాలి. ఉద్యోగ భద్రత నుంచి జర్నలిస్టుల సంక్షేమం వరకు అనేక సమస్యలున్నాయి. వీటి గురించి ప్రభుత్వానికి ప్రత్యేకించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలియనివేమీ కావు. వాటి పరిష్కారానికి ప్రయత్నం మొదలుపెట్టాలంటే అందుకు తగిన రీతిలో ఆలోచన చేయాలి. మీడియా యాజమాన్యాల ప్రయోజనాలతో పాటుగా మీడియాలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల సమస్యల పట్ల శ్రద్ధ వహించే ఆలోచన ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. కేవలం యూనియన్ల వినతిపత్రాలు, ప్రభుత్వ హామీలుగా చూస్తే ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంటుంది. జర్నలిస్టుగా గుర్తింపు ఉండే అక్రిడిటేషన్ కోసం ఆందోళన చేసే పరిస్థితి ఉంటే ఇక ఇతర సమస్యలు సంగతి ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదు. మారిన కాలమాన పరిస్థితులు, పెరిగిన శాస్త్ర సాంకేతిక విజ్ఞాన వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని మీడియా తీరుతెన్నులపై సరైన అధ్యయనం జరిగినప్పుడు మాత్రమే అది సాధ్యం. ఇళ్లస్థలాలు, ఆరోగ్యబీమా, పెన్షన్ తదితర సదుపాయాల గురించి చర్చ కూడా అరాకొరగానే సాగుతుంది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో 12వేలకు పైగా పెన్షన్ పొందుతున్న జర్నలిస్టులుంటే ఇక్కడ ఆ పరిస్థితి ఎందుకు లేదనే ప్రశ్న వేసుకున్నప్పుడే దానికి సమాధానం లభిస్తుంది. రాష్ట్రంలో పెద్ద పత్రికలు, ఛానళ్లతో పాటు అనేక చిన్న పత్రికలు, స్థానిక కేబుల్ మీడియా సంస్థలు ఈ రంగంలో పనిచేస్తున్నాయి. వాటిపై ఆధారపడి జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు జీవిక కొనసాగిస్తున్నారు. ఇటీవలకాలంలో జర్నలిస్టులు కూడా ఆత్మహత్యలకు పాల్పడే స్థితి చూస్తున్నాం. ఈ అన్ని రకాల రుగ్మతలకు అధిగమించి మీడియా విలువలతో నడిచేందుకు, అందులో పనిచేస్తున్నవారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా జీవనం సాగించేందుకు అవసరమైన కనీస ఏర్పాటు దిశగా యోచన చేసేందుకు, అది కార్యరూపం దాల్చేందుకు వీలైన కార్యాచరణ అవసరం. అందుకు అన్నివేళలా ప్రభుత్వానికి తోడుండేందుకు జర్నలిస్టు సంఘాలుగా మేం సిద్ధం.




# చంద్రబాబు బాధ్యతల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్ లో బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి హెూదాలో ఐదేళ్ల తరువాత సచివాలయానికి వచ్చిన చంద్రబాబు నాయుడుకు రాజధాని రైతులు ఘనమైన స్వాగతం పలికారు. వేల మంది రోడ్ల మీదకు వచ్చి రాహదారులు అన్నీ పూలమయం చేసి ముఖ్యమంత్రి పై అభిమానం చాటారు. అలాగే సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ సిఎస్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న జవహర్‌రెడ్డి సెలవుపై వెళ్ళారు. జూన్ 7న వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన గవర్నర్ జస్టిస్ నజీర్‌ను, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.





# సియం ముఖ్య కార్యదర్శిగా రవిచంద్ర

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా యం. రవిచంద్ర జూన్ 13న పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకులో ఆయన సియం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందించారు. సచివాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పలువురు అధికారులు, సిబ్బంది రవిచంద్రకు పుచ్ఛ గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

# కొలువుతీరిన కూటమి



ఆంధ్రప్రదేశ్లో శాసనసభ ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. ఎన్డీఏ నేతృత్వంలోని కూటమి అఖండ విజయాన్ని సంపాదించింది. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు ఉమ్మడిగా కలిసి పోటీ చేసి ఈ విజయాన్ని కైవసం చేసుకున్నాయి. అధికార పక్షం 164 స్థానాలు గెలుచుకోగా ప్రతిపక్షం కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జులై 12వ తేదీన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా మరో 24 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఎన్డీఏ గెలిచిన 164 మందిలో 135 మంది తెలుగుదేశం పార్టీ, 21మంది జనసేన పార్టీ, 8మంది బిజెపికి చెందిన శాసనసభ్యులు ఎన్నికయ్యారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. మొత్తం మంత్రివర్గంలో ముగ్గురు జనసేన పార్టీకి చెందిన వారు. ఒకరు భారతీయ జనతా పార్టీ నుంచి మిగిలిన వారు తెలుగుదేశం పార్టీ నుంచి ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదాకు అవసరమైనన్ని స్థానాలను కూడా సాధించలేకపోయింది. అంచనాలను తల్లకిందులు చేస్తూ ప్రజలిచ్చిన అఖండమైన తీర్పిది.

**అంబరాన్నంటిన ప్రమాణ స్వీకార సంబరాలు**

గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటి పార్క్ వద్ద జూన్ 12న జరిగిన మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమ సంబరాలు అంబరాన్నంటాయి. ముందుగా ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడుతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొణిదెల పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణం చేయించారు. తరువాత కింజారపు అచ్చన్నాయుడు, నారా లోకేష్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, అనిత వంగలపూడి,





# మంత్రులు - శాఖలు

**నారా చంద్రబాబు నాయుడు**: ముఖ్యమంత్రి, జీఏడీ, లా అండ్ ఆర్డర్, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ (మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు)

**కొణిదల పవన్ కల్యాణ్:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ

**నారా లోకేశ్:** మానవ వనరుల అభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్లశాఖ

**కింజరాపు అచ్చెన్నాయుడు:** వ్యవసాయం, సహకారశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ

**కొల్లు రవీంద్ర:** గనులు, ఎక్సైజ్‌శాఖ

**నాదెండ్ల మనోహర్:** పౌరసరఫరాలశాఖ

**పొంగూరు నారాయణ:** మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్

**వంగలపూడి అనిత:** హెూంశాఖ, విపత్తుల నిర్వహణ

**సత్యకుమార్ యాదవ్:** ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, మెడికల్ ఎడ్యుకేషన్

**నిమ్మల రామానాయుడు:** జలవనరులు అభివృద్ధిశాఖ

**ఎన్ఎండీ ఫరూక్:** న్యాయ, మైనారిటీ సంక్షేమం

**ఆనం రామనారాయణరెడ్డి:** దేవాదాయ

**పయ్యావుల కేశవ్:** ఆర్థిక, ప్రణాళిక, కమర్షియల్ ట్యాక్సెస్, శాసనసభ వ్యవహారాలు

**అనగాని సత్యప్రసాద్:** రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్లు

**కొలుసు పార్థసారథి:** గృహనిర్మాణం, సమాచార శాఖ

**డాక్టర్ డోల బాల వీరాంజనేయస్వామి:** సాంఘిక సంక్షేమం, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ

**గొట్టిపాటి రవికుమార్:** విద్యుత్ శాఖ

**కందుల దుర్గేశ్:** పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ

**గుమ్మడి సంధ్యారాణి:** గిరిజన, మహిళా, శిశు సంక్షేమం

**బీసీ జనార్దన్‌రెడ్డి:** రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు

**టీజీ భరత్:** పరిశ్రమలు, వాణిజ్యం

**ఎస్. సవిత:** బీసీ సంక్షేమం, చేనేత, జౌళి

**వాసంశెట్టి సుభాష్:** కార్మికశాఖ

**కొండపల్లి శ్రీనివాస్:** చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలు

**మందిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి:** రవాణా, యువజన, క్రీడలు

సత్య కుమార్, నిమ్మల రామానాయుడు, ఎన్.ఎం.డి ఫరూక్, ఆనం రాంనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్య ప్రసాద్,

కొలుసు పార్థసారథి, డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యా రాణి, బీసీ జనార్ధన్ రెడ్డి, టి.జి . భరత్, ఎస్. సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లతో రాష్ట్ర మంత్రులుగా రాష్ట్ర గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, సినీ నటులు చిరంజీవి, ప్రభృతులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

**ప్రతిరోజూ సచివాలయానికి**

పాలనలో తన మార్క్ అడ్మినిస్ట్రేషన్ చూపించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయంలోనే ఉండాలని ఆయన నిర్ణయించుకున్నారు. మంత్రులు కూడా నిత్యం సచివాలయానికి రావాలని ఆయన సూచించారు. శాఖలపై పట్టు పెంచుకోవాలని, పాలనాపరంగా అవగాహన పెంచుకోవాలని దిశానిర్దేశం చేశారు.



# మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారథి

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రిగా కొలుసు పార్థసారథి జూన్ 14వ తేదీ రాత్రి 8.00 గంటల సమయంలో బాధ్యతలు చేపట్టారు. అమరావతి సచివాలయం ఐదో బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్లోని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛాంబరులో రాష్ట్ర మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా భాద్యతలు చేపట్టేందుకు సతీసమేతంగా రాష్ట్ర సచివాలయానికి విచ్చేసిన ఆయనకు గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. పండితుల వేదమంత్రాల మధ్య తమ సీటులో ఆసీనులై మంత్రిగా భాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి బి.మహ్మద్ దివాన్ మైదీన్, పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి కమిషనర్ కాటమనేని భాస్కర్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి.కిరణ్ కుమార్, టి. కస్తూరీభాయి, ఐ.సూర్యచంద్రరావు, ఛీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరు మధుసూధనరావు, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్లు కృష్ణారెడ్డి, నాగరాజు తదితరులతో పాటు పలువురు అధికారులు, అనధికారులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలా శాఖ మంత్రిగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు మానవ వనరుల అభివృద్ధి, ఐ.టి. శాఖ మంత్రి నారా లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేదలు అందరికీ శాశ్వత ప్రాతిపదికన గృహవసతి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్రాల నిధులను భారీ ఎత్తున రాబట్టేందకు అన్ని విధాలుగా కృషిచేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిపివేసిన దాదాపు 13.80 లక్షల గృహాలను పూర్తి చేస్తామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని హౌసింగ్ కాలనీల్లో అమృత్, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకాల క్రింద పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తామన్నారు. గృహ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనపై ఎప్పటి కప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అమలాపురంలో మే 29న జరిగిన ఫెడరేషన్ నియోజకవర్గ మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గం




రావులపాలెంలో మే 28న జరిగిన కొత్తపేట ఫెడరేషన్ నియోజకవర్గ మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గం



హైదరాబాద్‌లో మే 27న ఫిల్మ్ జర్నలిస్టు ధీరజ్ అప్పాజీకి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ప్రదానం చేసినప్పటి దృశ్యం

# కేన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

**ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



కేన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య శాఖ మంత్రిగా సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిమ్స్ తరహాలో మెరుగైన వైద్య సేవలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని, అందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగు పర్చడంతో పాటు సిబ్బందికూడా సమకూర్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జూన్ 16వ తేదీ ఉదయం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వైద్య విద్య శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల్లో అత్యధికంగా కేన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని, ప్రతి ఏడాది సగటున 48 వేల మంది కేన్సర్ మహమ్మారి బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఓరల్, బ్రెస్టు, సర్వైకల్ కేన్సర్ల నివారణకై ప్రజల్లో సరైన అవగాహన కల్పించడంతో పాటు కేన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి ముందస్తు వైద్య సేవలు అందజేయాలనే లక్ష్యంతో దాదాపు 5 కోట్ల 30 లక్షల మందికి స్క్రీనింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంటూ తొలి సంతకం చేయడం జరిగిందన్నారు. ఇందుకై ఇంటింటి సర్వే నిర్వహించేందుకు అవసరమైన శిక్షణను ఏ.ఎన్.ఎం.లు, ఆషాలు ఇతర అంబాసిడర్లకు హోమీ బాబా కేన్సర్ ఇన్ స్టిట్యూట్ ద్వారా ఇప్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. రాష్ట్రంలో కేన్సర్ వ్యాధి నియంత్రణకు ఆరోగ్యశ్రీ పథకం క్రింద గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.600 కోట్లను వెచ్చినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 18 సంవత్సరాల లోపు విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం క్రింద రాష్ట్రంలోని 18 సంవత్సరాలలోపు విద్యార్థులు అందరికీ స్క్రీనింగ్ చేసే ఫైల్ పై మరో సంతకం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.



**రావులపాలెంలో నివాళి అర్పిస్తున్న ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు**

# ఈనాడు సృష్టికర్త రామోజీ ఇకలేరు!



ఈనాడు సృష్టికర్త, మార్గదర్శితో పాటు అనేక సంస్థలను నెలకొల్పిన పారిశ్రామికవేత్త చెరుకూరి రామోజీరావు జూన్ 7వ తేదీ తెల్లవారుఝామున హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. రామోజీరావు తెలుగు దినపత్రిక ఈనాడు వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు, ప్రచురణ కర్త, సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన రామోజీరావు అడ్వర్‌టైజ్‌మెంట్ సంస్థలో ఆర్టిస్ట్‌గా వృత్తి జీవితం ఆరంభించి వ్యాపారవేత్తగా మారారు. అనంతరకాలంలో వివిధ రంగాలకు చెందిన వ్యాపారాలతో విస్తరించి గిన్నిస్ రికార్డులకెక్కిన ఫిల్మ్‌సిటీ నిర్మించారు. ఆయన మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి మొదలగు వ్యాపార సంస్థల అధినేత. రామోజీరావు స్థాపించిన రామోజీ ఫిల్మ్ సిటీ ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో. ఆయనకు 2016లో భారత ప్రభుత్వం దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీతో సహా దేశంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. రామోజీరావు మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టు అసోసియేషన్ (ఎ.పి.బి.జె.ఎ)లు సంతాపం ప్రకటించాయి. జూన్ 9న అధికార లాంఛనాలతో రామోజీ ఫిల్మ్‌సిటీలో అంత్యక్రియలు జరిగాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు మీడియా సంస్థలకు చెందినవారు హాజరై నివాళులర్పించారు. ఈనాడు గ్రూపు సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది పెద్దదిక్కు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనాడుతో పాటు ఆయన స్థాపించిన అన్ని సంస్థలకు చెందిన సిబ్బంది అంత్యక్రియల సందర్భంగా హాజరై నివాళులర్పించారు.

**కుటుంబ నేపథ్యం**

రామోజీరావు కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవంబరు 16న రైతుకుటుంబంలో జన్మించాడు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి వెంకట సుబ్బారావు. రామోజీరావు పూర్వీకులు పామర్రు మండలంలోని పెరిశేపల్లి గ్రామానికి చెందినవారు. అతని తాత రామయ్య కుటుంబంతో పెరిశేపల్లి నుంచి పెదపారుపూడికి వలస వచ్చాడు. రామోజీరావు తాత మరణించిన 13 రోజులకు జన్మించాడు. దానితో అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు రామయ్య అన్న పేరు పెట్టారు. ఇతనికన్నా ముందు ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్దక్క రాజ్యలక్ష్మి, చిన్నక్క రంగనాయకమ్మ.

**బాల్యం, విద్యాభ్యాసం, వివాహం (1937 – 1961)**

ఇతని కుటుంబానిది శ్రీ వైష్ణవ నేపథ్యం. తల్లి చాలా భక్తిపరురాలు, ఆచారవంతురాలు కావడంతో చిన్నతనంలో ఇతనికీ భక్తి, శుచి

# రామోజీరావు ప్రస్థానం

కృష్ణా జిల్లా పెదపారపూడి గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబంలో జననం: 1936 నవంబర్16

విద్యాభ్యాసం: 1947లో గుడివాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేరి 1951 వరకు సిక్స్త్ ఫాం వరకు చదివారు. గుడివాడ కళాశాలలో ఇంటర్మీడియట్, బీఎస్సీ పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం: ఢిల్లీలోని ఓ యాడ్ ఏజన్సీలో ఆర్టిస్ట్

వివాహం: 19.08.1961

వ్యాపార సంస్థల స్థాపన

1962 అక్టోబరులో మార్గదర్శి చిట్‌ఫండ్

1965లో కిరణ్ యాడ్స్ ప్రారంభం.

1967–1969 ఖమ్మంలో వసుంధర ఫెర్టిలైజర్స్

1969లో అన్నదాత పత్రిక ప్రారంభం

1970లో ఇమేజస్ అవుట్‌డోర్ అడ్వర్టయిజింగ్ ఏజన్సీ

1972–1973 విశాఖలో డాల్ఫిన్ హోటల్ నిర్మాణానికి శ్రీకారం

21.06.1980లో త్రీస్టార్ హోటల్‌గా డాల్ఫిన్ ప్రారంభం

**10.08.1974లో విశాఖ 'ఈనాడు' ప్రారంభం**

12.08.1974లో మార్గదర్శి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్

1975 డిసెంబరు 17న 'ఈనాడు' హైదరాబాదు ఎడిషన్

03.10.1976లో సినీ ప్రేమికుల కోసం 'సితార' పత్రిక

ఫిబ్రవరి 1978లో 'చతుర', 'విపుల' మాస పత్రికలు

09.02.1980లో 'ప్రియా ఫుడ్స్'

02.03.1983లో 'ఉషాకిరణ్ మూవీస్' ఏర్పాటు

1990లో 'ఈనాడు జర్నలిజం స్కూలు' ప్రారంభం.

1992–1993లో సారాపై సమరం. మద్యంపై నిషేధ ఉత్తర్వులు వచ్చేదాకా పోరు.

1996లో ప్రపంచలోనే అతి పెద్ద చిత్రనగరి 'రామోజీ ఫిల్మ్ సిటీ' స్థాపన

27.01.2002లో 'ఈటీవీ' ఆధ్వర్యంలో ఆరు ప్రాంతీయ ఛానళ్లు

20.06.2002లో 'రమాదేవి పబ్లిక్ స్కూల్'

14.04.2008లో సమాచార చట్టం కోసం 'ముందడుగు'

25.12.2014లో ప్రధాని మోదీ 'స్వచ్ఛభారత్' కార్యక్రమ ప్రచార భాగస్వామిగా రామోజీరావును నామినేట్ చేశారు.

14.11.2015లో మరో నాలుగు ఈటీవీ ఛానళ్ల ఆరంభం

అలవడింది. లేకలేక పుట్టిన మగసంతానం కావడంతో రామోజీని చాలా ముద్దుచేసేవారు. పెద్దక్క పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయినా చిన్నక్క రంగనాయకమ్మతో సాన్నిహిత్యం ఉండేది. ఇంట్లో తల్లికి ఇంటిపనుల్లో, వంటలో సహాయం చేసే అలవాటూ ఉండేవి. రామయ్య అన్న తన పేరు నచ్చక ప్రాథమిక పాఠశాలలో చేరేప్పుడే స్వంతంగా "రామోజీ రావు" అన్న పేరును సృష్టించుకుని, తానే పెట్టుకున్నాడు. రామోజీరావు 1947లో గుడివాడలో పురపాలకోన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేరాడు. 1957లో ఆరవ ఫారం అక్కడే పూర్తిచేసుకుని, గుడివాడ కళాశాలలో ఇంటర్, బీఎస్సీ చదివారు. 1961 ఆగస్టు 19న రామోజీరావుకు, పెనమలూరుకు చెందిన తాతినేని వెంకట సుబ్బయ్య, వాణీదేవిల రెండవ కుమార్తె రమాదేవితో వివాహం జరిగింది. రమాదేవి అసలు పేరు రమణమ్మ కాగా పెద్దలు పెట్టిన పేరు నచ్చక రమాదేవిగా మార్చుకుంది. రామోజీరావుతో భార్య వైపు బంధువుల్లో చిన్న బావమరిది తాతినేని వెంకట కృష్ణారావు మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థలో డైరెక్టరుగా, తోడల్లుడు ముసునూరు అప్పారావు ఈనాడు, డాల్ఫిన్స్ హోటల్స్ మాజీ ఎండీగా పనిచేశారు.

## ఎన్ఏజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

తెలుగు నాట ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలకు సంబంధించిన ఈనాడు ఈటీవీతోపాటు అనేక వాణిజ్య సంస్థలను సృష్టించి, కొత్త పుంతలు తొక్కించిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ ( ఎన్ఏజే ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్కే పాండే, ఎన్ కొండయ్య ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్( ఏపిడబ్ల్యూజేఎఫ్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీ బీజేఏ) కన్వీనర్లు వి శ్రీనివాసరావు, కే మునిరాజు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మీడియాలో కొత్త వరవడి సృష్టించి సాహితీ రంగానికి ఎనలేని సేవ చేసిన రామోజీరావు మరణం విచారకరం. తెలుగు భాషకు అమోఘమైన సేవ చేశారు. వాడుక భాషను వినియోగంలోకి తీసుకురావడంలో కీలక భూమి పోషించడం ద్వారా ఆ పత్రికలను పాఠకులకు చేరువచేసి పెద్ద సంఖ్యలో పాఠకులను తయారు చేసిన ఘనత రామోజీరావుదే. ఆయన మృతి పట్ల ఎన్ఏజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏలు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశాయి.




# మీడియా హక్కులను కాపాడాలి

**ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు**

ప్రభుత్వాలు జర్నలిస్టుల హక్కులను కాపాడాలని, మీడియా చట్టాలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు అన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ కొత్తపేట నియోజకవర్గ మహాసభ జిల్లానాయకులు బంగార్రాజు అధ్యక్షతన రావులపాలెం సి ఆర్ సి క్లబ్‌లో మే 28న జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఉన్న చట్టాలను అమలు చేయకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. వేజ్ బోర్డు సిఫార్సు మేరకు జర్నలిస్టులకు వేతనం చట్టం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటానికి సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్య భీమాలో చేరేందుకు జర్నలిస్టులను సమాయత్తం చేయాలని, తద్వారా అనారోగ్యానికి గురైన జర్నలిస్టుల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం. శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ రాజ్, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షుడు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

కొత్తపేట నియోజకవర్గ కమిటీ అధ్యక్షులుగా వి బాబుల్, కార్యదర్శిగా ప్రసాద్ కుమార్, ఉపాధ్యక్షుడుగా గన్ని రాజు, సహాయం కార్యదర్శిగా యు సురేష్, కోశాధికారిగా సహదేవుడుతో పాటు ఆరుగురు కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.



# ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై అమెరికాలో ఇంత మోజా!

ఎ.అమరయ్య

హైదరాబాద్‌లో 2024 జూన్ 3వ తేదీ రాత్రి 9.35 గంటల ప్రాంతంలో శంషాబాద్ విమానాశ్రయం నుంచి సుమారు 240 మంది మనోళ్లు అమెరికా బయలు దేరారు. అందరూ చాలా హుందాగా, ఎవరికి తోచిన విధంగా వాళ్ళు తమ హావాను, గొప్పతనాన్ని చాటుకుంటూనే గుంభనంగా– వచ్చి రాని ఇంగ్లీషులో కొందరు, వచ్చిన ఇంగ్లీషులో మరికొందరు మాట్లాడుకుంటున్నారు. ఈ రెండు మాట్లాడలేని వాళ్ళు తమ సొంత భాషల్లో మూడో చెవిన పడకుండా గుసగుసలాడుకుంటున్నారు. విమానం కావడంతో 'లేని పెద్దరికాన్ని తెచ్చుకున్న' నాలాంటి వాళ్లు పెద్దగా ఏమీ మాట్లాడకుండా అందర్నీ గమనిస్తూ ఇంగ్లీషు మర్యాదల్ని పాటిస్తున్నారు అరబ్బీ విమానంలో.

**2024 జూన్ 4 తెల్లవారు జామున..**

హైదరాబాద్ నుంచి బయలు దేరిన విమానం 3 గంటల 12 నిమిషాల పాటు ప్రయాణించి అర్థరాత్రి దాటిన తర్వాత దుబాయి విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడ చెప్పే మూగసైగల్ని బట్టి (దుబాయ్ విమానాశ్రయంలో మైకులు ఉండవు. కనెక్టివిటి ఫ్లైట్స్ కి సంబంధించిన సూచనలు మాత్రమే ఎర్రటి అక్షరాల్లో రాసి ఉంటాయి. వాటిని బట్టి మనం పోవాలి) ఎవరెక్కాల్సిన విమానాల వైపు వాళ్ళు వెళ్లారు. ఎక్కువమంది మాత్రం గేట్ నెంబర్ 25 బీ వైపు వచ్చారు. అప్పటి వరకు ఖాళీగా ఉన్న కుర్చీలు ఒక్కొక్కటి నిండుతున్నాయి. టెక్సాస్ లోని డాలస్ లేదా డల్లాస్ వెళ్ళాల్సిన విమానం ఎక్కడానికి ఇంకొంక గంటకు పైగా టైమ్ ఉండడంతో కుర్చీలలో కూర్చున్న వాళ్ళు ఒక్కొక్కరుగా 'ముసుగులు' తీయడం మొదలు పెట్టి తమ 'లోపలి అచ్చమైన మనుషుల్ని' బయటపెట్టడం మొదలు పెట్టారు.

ఎన్నికల రిజల్ట్స్ వేళ విమానంలో...

ఇలా ముచ్చట మొదలుపెట్టిన వాళ్ళల్లో అటు శ్రీకాకుళం మొదలు ఇటు అనంతపురం వరకు, ఇటు ఆదిలాబాద్ నుంచి అటు చిత్తూరు వరకు అందరూ మనోళ్లే! అరగంటలో ఈ ముచ్చట్లు అలా– డ్యూటీ ఫ్రీ లిక్కర్ మీదుగా చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి, కేసీఆర్, రేవంత్ మీదుగా కిషన్ రెడ్డి, నరేంద్ర మోదీ వరకు సాగాయి. సూటూ బూటు వేసుకున్న ఓ పెద్దాయన.. ఇంతకీ చంద్రబాబు గెలుస్తాడంటావా అనడిగితే ఇంకోయాన.. మనకి విమానంలో ఇంటర్నెట్ ఇస్తే బాగుండ్దు.. అనడం మొదలుపెట్టారు. ఇంతలో విమానం ఎక్కమని ఎమిరేట్స్ విమాన సిబ్బంది చెప్పడంతో ఈ ఎన్నికల గోల మర్చిపోయారు. అప్పటికే తెల్లవారు జాము మూడయింది.

**ఆకాశంలోనే 16 గంటలు..**

ఈ విమానం ఎక్కిన దగ్గర్నుంచి 15గంటల 44 నిమిషాల పాటు ఏకధాటి ప్రయాణం. 12,913 కిలోమీటర్ల దూరం. విమానం ఎక్కిన తర్వాత గంటకి అది 13వేల అడుగుల ఎత్తుకి చేరింది. గంటకి 9 వందల నుంచి 11 వందల కిలోమీటర్ల వేగంతో పోతోంది. విమానం వాళ్లు ఆ తెల్లవారుజామున తిండిపెట్టారు. అది తిన్న జనం మత్తుగా నిద్రలోకి జారుకున్నారు. దుబాయిలో విమానం ఎక్కినప్పుడు 4వ తారీఖు. ఆ రోజంతా విమానంలోనే గడచిపోయింది. నిద్రమత్తులో జనానికి ఇండియా ఎన్నికల ఫలితాలు గుర్తుకురాలేదు. ఎమిరేట్స్ విమానం అట్లాంటిక్ సముద్రం దాటి అమెరికా వైపు మళ్ళిన తర్వాత మన వాళ్లకు మళ్లీ ఆంధ్రా ఎన్నికలు గుర్తుకువచ్చాయి.

**విమానంలో వైఫై..**

విమానంలో వైఫై ఉంటుందని గుర్తుకొచ్చిన ఒకరిద్దరూ వాళ్లను అడిగితే అదనపు డబ్బులు కట్టాలన్నారు. దాంతోపాటు మన దగ్గరుండే మొబైల్ కి ఇంటర్నేషనల్ రోమింగ్ ఉండాలన్నారు. ఇవన్నీ అయ్యే పనులు కాదు లెమ్మని కొందరు మేధావులు విమానంలోని లోకల్ లాన్ లో వస్తున్న బీబీసి హెడ్ లైన్స్ పెట్టి చూశారు. అదేమో ఎప్పటికప్పుడు అప్ డేట్ కాదు. అలా అయిన ఓ సందర్భంలో చూస్తే – మోదీ గెలిచే అవకాశం ఉన్నాయి, అయితే మెజారిటీ తగ్గవచ్చు అని ఉంది గాని తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదు.

ఊరంతా తిరిగొచ్చిన మనోళ్లకి ఇంటి ముందరికి వచ్చిన తర్వాత తొందరెక్కువైంది. విమానం మరో అరగంటలో డాలస్ ఫోర్ట్ వర్త్ విమానాశ్రయంలో దిగుతుందనగా మనోళ్లకి మళ్లీ గొంతులు లేచాయి. నా పక్కన కూర్చున్న ఓ తమిళ అమ్మాయిని ఓ శ్రీకాకుళం జిల్లా వాసి 'అమ్మాయ్, నీ ఫోన్ లోకలేనా, నెట్ వర్క్ ఉందా, మన ఎన్నికలు ఏమయ్యాయో కనుక్కోరాదూ' అన్నారు. దానికామె.. మనమింకా గాల్లోనే ఉన్నాం, 10వేల 450 అడుగుల ఎత్తులో ఉన్నామండీ,

అప్పుడే నెట్ వర్క్ తగులుకోదు' అనడంతో ఉసూరుమన్న ఆ పెద్దాయన.. డల్లాస్ పోయిన తర్వాతైనా చెప్పు అన్నాడు గాని ఇమిగ్రేషన్ హడావిడి, ఆయన కుమారుడి మందలింపుతో మర్చిపోయారు.

**2024 జూన్ 4 (అమెరికా టైం ప్రకారం ఉదయం 9.45)**

దుబాయ్ నుంచి వచ్చిన ఎమిరేట్స్ విమానం డల్లాస్ లో దిగింది. అందరూ మునిగాళ్ల మీద నిలబడి ఉన్నారు. చక్రాల కుర్చీల సందడి. పోర్టర్ల హడావిడి. ఇండియా నుంచి వచ్చిన వాళ్లను తనిఖీ చేసి వాళ్ల దేశంలోకి అనుమతిచ్చే ఎమిగ్రేషన్ పూర్తి కావడానికి గంటన్నర. లగేజీలు తీసుకోవడానికి ఇంకో అరగంట. వెరసి బయటకు వచ్చేపాటికి ఉదయం 11 దాటింది.

అమెరికాలో తెలుగోళ్ల రాష్ట్రంగా పేరొందిన టెక్సాస్ లో ప్రత్యేకించి డల్లాస్ లో తెలుగువాళ్ల సందడి అంతా ఇంతాకాదు. హైదరాబాద్ బిర్యానీ మొదలు కోనసీమ గుమగుమల వరకు సర్వస్వం ఇక్కడ ఉన్నాయి.

అప్పటిదాకా అణుచుకున్న రిజల్ట్ ఫీవర్ని ఇక నేను దాచుకోలేక మమ్మల్ని తీసుకువెళ్లడానికి వచ్చిన మా అల్లుడు సందీప్ ని అడిగేశా.. 'అదేంటీ, మీరిప్పటి దాకా తెలుసుకోలేదా? ఫ్లైట్ లో వైఫై హైర్ చేస్తే పోయేది కదా' అని ఆశ్చర్యపోతూ– మనవాళ్లు ఎక్కువ మంది ఇండియా బజార్ వద్ద ఉంటారు వెళ్దామా అన్నాడు. కారు నిండా లగేజీ, చేతిలో చిన్న పిల్లలు.. ఎందుకన్నట్టుగా తనవైపు చూశా..

**అసలింతకీ విషయం ఏమిటీ?**

ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అని మళ్లీ అడిగా.. మీ పాత యజమాని జగన్ మోహన్ రెడ్డి దారుణంగా ఓడిపోయారు. చంద్రబాబు నాయుడు చక్రం తిప్పాడు, జగన్ ది అట్టర్ ఫ్లాప్ షో అన్నాడు. ఇంతకీ ఎన్ని వచ్చాయి అని మళ్లీ అడిగా.. చంద్రబాబుకి 164, జగన్ కి 11 అనడంతో జోక్ చేస్తున్నాడేమో అనుకున్నా. అది నిజమని నా మనసుకి ఎక్కడానికి దాదాపు 30,40 సెకన్లు పట్టింది. అంతటి స్వీప్ ఉందని ఒకరిద్దరూ చెప్పినా నేను నమ్మకపోవడమే దానికి కారణం. ఇంతలో కారు ఇర్వింగ్ వైపు మళ్లింది.

**ఇర్వింగ్ అంటే మన లెనిన్ సెంటర్ లేదంటే ఇందిరా పార్కు..**

ఒకప్పుడు కమ్యూనిస్టుల మీద ఓ జోక్ ఉండేది. రష్యాలో వానొస్తే ఇండియాలో గొడుగు పడతారని. ఇప్పుడు అదే సామెత అమెరికాలో ఉంటున్న మనోళ్లకి సరిగ్గా అతికినట్టు సరిపోతుందనుకుంటా. కేసీఆర్ గెలిచినా ఓడినా, చంద్రబాబు అరెస్టయినా, విడుదలైనా, జగన్ మోహన్ రెడ్డి సీఎం అయినా కాకున్నా, పవన్ కల్యాణ్ సినిమా అయినా చిరంజీవి ప్రకటనైనా అమెరికాలో ఉండే తెలుగోళ్లకి పండగే. ఇట్లాంటి పరిస్థితుల్లో డల్లాస్ లో ఉండే తెలుగువాళ్లకి చంద్రబాబు గెలుపంటే.. అదీ క్లీన్ స్వీప్ అంటే ఇక చెప్పేదేముందీ.

డల్లాస్ లో ఇర్వింగ్ అని ఓ ప్రాంతం ఉంది. హైదరాబాద్ ఎవరు వెళ్లినా ముందుండేది రాం నగర్ అన్నట్టుగా మనవాళ్లు ఎవరు వచ్చినా ముందు వాలిపోయేది ఈ ప్రాంతమే. అందువల్లే మన వాళ్ల ర్యాలీలకీ ఈ ప్రాంతాన్నే ఇస్తుంటారు డల్లాస్ అధికారులు. ఐదు ప్రాంతాల్లో ర్యాలీలకు అధికారులు అనుమతిచ్చారు. ఇక చూస్కో.. ఆ ప్రాంతాలన్నీ మార్మోగాయి. కార్లు షికార్లు చేశాయి. డీజే మోతలతో మత్తెక్కించే పాటలతో కుర్రకారు హోరెత్తించింది. బాణసంచా మోతమోగింది. వందలాది మంది గుమికూడి అరుపులు, కేకలతో మోతమోగించారు. నిజానికి ఈ సంబరాలు ఇండియాలో ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడే మొదలయ్యాయి. ఆ మర్నాడు కూడా కొనసాగాయంటే తెలుగు రాష్ట్రాల ఎన్నికల పట్ల ఇక్కడి వారు ఎంత ఆసక్తి చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. చిత్రమేమిటంటే జగన్ గెలిచిన 2019లోనూ ఇదే తరహాలో ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు మోతమోగాయి.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం సుమారు వేయి మంది డల్లాస్ నుంచి వచ్చారని ఓ మిత్రుడు చెప్పారు. కేవలం ఓటు వేయడం కోసమే వాళ్లు వచ్చారని చెప్పినప్పుడు ఆశ్చర్యపోవడం నా వంతు అయింది.

టీడీపీకి బలమైన ఎన్నారై విభాగం ఉంది. ఈ విభాగం ఆధ్వర్యంలోనే ఈ వేడుకలు సాగాయి. కార్లపై నిలబడి కుర్రకారు టీడీపీ జెండాలను రెపరెపలాడించారు. పసుపు రంగు పొగగొట్టాలను పేల్చారు. ఈ వేడుకలు జరిగిన తీరు చూస్తుంటే ఎన్నారై విభాగం ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు కనిపించింది. టీడీపీ, జనసేన మద్దతుదారులు ఇక్కడి నుంచే సోషల్ మీడియాలో మహాకూటమి అనుకూల ప్రచారాన్ని హోరెత్తించాయి. బాలకృష్ణ, పవన్ కల్యాణ్, చిరంజీవి సినిమాలు విడుదలైతే డల్లాస్ హైదరాబాద్, విజయవాడలుగా మారిపోతాయని ఎన్.నవీన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో కంటే డల్లాస్ లోని తెలుగువాళ్లే టీడీపీ, జనసేన, బీజేపీ విజయోత్సవాన్ని భారీగా జరుపుకున్నారేమో అనిపించింది.




# హక్కుల సాధనకు సమాయత్తం

## ఫెడరేషన్ పిలుపు

జర్నలిస్టుల ఉనికి ప్రమాదంలో పడిందనీ, వృత్తి పరంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నందున జర్నలిస్టులు సమాయత్తమై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అమలాపురం నియోజకవర్గ మహాసభ అమలాపురం ప్రెస్ క్లబ్‌లో మే 29న జరిగింది. ఈ మహా సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇవ్వాల్సిన రాయితీలను కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. జర్నలిస్టుల హక్కుల అయిన అక్రెడిటేషన్లు ఇవ్వడంలో అనేక అడ్డంకులను సృష్టించడం దారుణమన్నారు. అలాగే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే విషయంలోనూ ప్రభుత్వాలు తాత్సారం చేస్తూ జర్నలిస్టులను మోసగిస్తున్నాయి తప్ప ఇళ్ళ స్థలాలు ఇవ్వడం లేదన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ మాత్రమే ఉద్యమించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సంక్షేమం అందించే విషయంలో మంచి కృషి జరుగుతుందని, జర్నలిస్టులు మృతి చెందినా, అనారోగ్యానికి గురైనా, ప్రమాదానికి గురైనా ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ ఫెడరేషన్ మాత్రమేనని అన్నారు. పది లక్షల కార్పస్ ఫండ్ నుండి వస్తున్న వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని ఆయన చెప్పారు ఇంకా ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం. శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరి, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షుడు బంగార్రాజు, ఫెడరేషన్ నాయకులు ముక్కామల చక్రధర్, రెడ్డి బాబు, బషీర్, సూరిబాబు, పి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ జిల్లా మహాసభ నిర్వహించేందుకు ముందుగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లో కమిటీలు ఏర్పడ్డాయి. మిగిలిన నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేసి సభ్యత్వ కార్యక్రమాన్ని వీలైనంత త్వరగా ముగించాల్సి ఉంది. రాష్ట్ర బాధ్యులుగా, కోశాధికారిగా ఉన్న శ్రీనివాస్ ఈ జిల్లాలో కమిటీల ఏర్పాటు బాధ్యత స్వీకరించిన అనంతరం ఆ దిశగా పనులు సాగుతున్నాయి. గతంలో జిల్లా కార్యదర్శిగా పనిచేసిన బంగార్రాజు చొరవ వల్ల కొన్ని నియోజకవర్గాల్లో కమిటీలు ఏర్పడేందుకు మార్గం సుగమం అయిందని నవీన్‌రాజ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక**

ఎపిడబ్ల్యుజెఎఫ్ అమలాపురం నియోజకవర్గ నూతన అధ్యక్షులుగా కడలి రాజు, ఉపాధ్యక్షులుగా ఆకుల సురేష్, కార్యదర్శిగా కడలి సూరిబాబు, కోశాధికారిగా పెయ్యల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా జి.కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఊటాల చిరంజీవి, కామన శ్రీనివాస్, మట్టపర్తి త్రిమూర్తులు,మోత వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి విష్ణు ప్రసాద్, చింతపల్లి జాన్ రత్నం, రెడ్డి శ్రీనివాస్,పరమట భీమా మహేష్ ఎన్నికయ్యారు.




# హిందీ పత్రికా దినోత్సవం

**హిందీ పత్రికా దివాస్ అని కూడా పిలువబడే హిందీ జర్నలిజం దినోత్సవం భారతదేశంలో హిందీ జర్నలిజం మూలాన్ని గుర్తుచేసుకోవడానికి నిర్వహిస్తున్నారు.**

జర్నలిజం అనేది అత్యంత పురాతనమైన వృత్తి. ఇది గణనీయమైన సామాజిక మార్పును ప్రభావితం చేయడానికి అత్యంత శక్తివంతమైన సాధనం. ప్రతి సంవత్సరం మే 30న, హిందీ జర్నలిజం దినోత్సవం దేశంలో మొదటి హిందీ వార్తాపత్రిక స్థాపన జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నారు. భారతదేశంలోని హిందీ వార్తాపత్రికల జర్నలిస్టులందరికీ ఈ రోజు ముఖ్యమైనది. భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలలో అవగాహన కల్పించడంలో వారిని ఏకం చేయడంలో వార్తాపత్రిక కీలక పాత్ర పోషించింది. ఆ సమయంలో అత్యంత ప్రాచుర్యం పొందిన కమ్యూనికేషన్ మాధ్యమం.

**మే 30న ఎందుకు జరుపుకుంటారు?**

మొదటి హిందీ-భాషా వార్తాపత్రిక, ఉదంత్ మార్తాండ్, భారతదేశంలో మే 30, 1826న కలకత్తా (ప్రస్తుతం కోల్‌కతా) నుండి ప్రచురితమయింది. పండిట్ జుగల్ కిషోర్ శుక్లా కేవలం మంగళవారాల్లోనే వారపత్రికను ప్రచురించారు. దీని ధర సంవత్సరానికి రెండు రూపాయలు. ఆ సమయంలో ఆయన చొరవతోనే ఈ ప్రచురణ మొదలైంది. అయినప్పటికీ, పెరిగిన మెయిలింగ్ ఖర్చులు పాఠకుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దాంతో ఉదంత్ మార్తాండ్‌ను ఎక్కువ కాలం ప్రచురణ కొనసాగించలేదు.

**హిందీ జర్నలిజం చరిత్ర, ప్రాముఖ్యత**

మే 30, 1826న, మొదటి హిందీ వార్తాపత్రిక ఉదంత్ మార్తాండ్ ప్రచురితమయింది. అప్పటి నుండి ఈ రోజు హిందీ జర్నలిజం చరిత్రలో ఒక ముఖ్యఘట్టంగా గుర్తింపు పొందింది. పండిట్ జుగల్ కిషోర్ శుక్లా వార్తాపత్రిక మొదటి సంపాదకుడు. ఆయన వాస్తవానికి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందినవాడు, ఆపై పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాకు వెళ్లాడు.

పండిట్ జుగల్ కిషోర్ శుక్లా హిందీ, ఆంగ్లం, సంస్కృతం, పర్షియన్ భాషలలో విస్తృతమైన పాండిత్యాన్ని కలిగి ఉన్నారు. అప్పట్లో ఇంగ్లీష్, పర్షియన్, బంగ్లా ప్రచురణలకు పెద్ద సంఖ్యలో పాఠకులు ఉన్నారు, హిందీ మీడియాకు చోటు లేకుండా పోయింది.

ఉదంత్ మార్తాండ్ వారానికి 500 కాపీల ముద్రణతో ప్రారంభమైంది. దేవనాగరి లిపిని ఉపయోగించి హిందీలో పూర్తిగా ప్రచురించబడిన మొదటి వార్తాపత్రిక ఇదే. ఆ సమయంలో, బెంగాలీ, ఉర్దూలోని అనేక వార్తాపత్రికలు ఎక్కువగా చదివేవారు. కలకత్తా పాఠకులలో చాలా తక్కువ శాతం హిందీని చదివేవారు.

# ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీకి ఎన్టీఆర్ పురస్కారం

నందమూరి తారకరామారావు 101వ జయంతిని పురస్కరించుకుని "ఇండియన్ లిటరేచర్ ట్రాన్సలేషన్ ఫౌండేషన్" ఎన్టీఆర్ జాతీయ పురస్కారాలు ప్రదానం చేసింది. హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మే 27న అత్యంత ఘనంగా నిర్వహించిన వేడుకలో సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ అండ్ రైటర్ ధీరజ అప్పాజీ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. కళారత్న బిక్కి కృష్ణ సారథ్యంలో కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకలో ఎన్టీఆర్ తనయుడు, ప్రముఖ ఛాయాగ్రాహకుడు, నిర్మాత నందమూరి మోహన కృష్ణ, ఎన్టీఆర్ మనవరాలు నందమూరి మోహన రూప, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్.ఎల్.సి. టి.డి.జనార్దన్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ కులపతి, ప్రముఖ భాషావేత్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, తెలుగువన్ డాట్ కమ్ అధినేత, నిర్మాత కంఠంనేని రవిశంకర్, ఆదాయపన్ను శాఖ ఛీఫ్ కమీషనర్ (రిటైర్డ్) యం. నరసింహప్ప, ప్రముఖ కవయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, దళిత జాగృతి పితామహుడు కుసుమ ధర్మన్న ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్, శతాధిక చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గిడుగు కాంతికృష్ణ తదితర లబ్ధ ప్రతిష్టులు పాలుపంచుకున్నారు. రెండు దశాబ్దాలుగా సినీ పాత్రికేయుడిగా నిర్విరామంగా పని చేస్తూ గత మూడేళ్ళుగా "ట్రెండ్ సెట్టర్"గా నిలిచిన "స్వాతిముత్యం" డిజిటల్ పేపర్‌ను నిరవధికంగా నిర్వహిస్తున్న ధీరజ అప్పాజీ ఇంతకుముందు "గిడుగు రామ్మూర్తి జాతీయ పురస్కారం, దాసరి ప్రతిభా పురస్కారం, కోడి రామకృష్ణ స్మారక పురస్కారం"తోపాటు 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్'చే ఉత్తమ సినీ పాత్రికేయ పురస్కారం" అందుకున్నారు. దాసరి 77వ జయంతి సందర్భంగా మార్చి 5న హైదరాబాద్ శిల్ప కళావేదికలో అత్యంత ఘనంగా నిర్వహించిన "దర్శకరత్న డి.ఎన్.ఆర్. ఫిల్మ్ అవార్డ్స్" కమిటీలో ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభులతోపాటు ధీరజ అప్పాజీ కూడా "జ్యూరీ మెంబర్"గా వ్యవహరించారు. ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా సాక్షాత్తు ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన్ కృష్ణ, మోహన రూప చేతుల మీదుగా, వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో "ఎన్టీఆర్ జాతీయ పురస్కారం" అందుకోవడం చాలా గర్వంగా ఉందన్న అప్పాజీ ఈ అవార్డుకు తనను ఎంపిక చేసిన కళారత్న బిక్కి కృష్ణగారికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు.




## రామోజీకి నివాళి

విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో జూన్ 10న ఈనాడు అధిపతి రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ఆ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. నారాయణ్ మాట్లాడుతూ మీడియా రంగంలో ఎన్నో కొత్తపోకడలకు బాటలు వేసిన రామోజీరావుకు నివాళులు అరిపంచారు. రాష్ట్రాభివృద్ధితో పాటు భాషాభివృద్ధికి పాటుపడిన రామోజీ వివిధ రంగాల్లో పరిశ్రమలు స్థాపించడమే కాక సినీరంగంలో అడుగిడి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫిల్మ్‌సిటీ నిర్మాణం చేపట్టి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.

# మునగపాకలో విలేకరి పై దాడి

వాస్తవాలను రాస్తుంటే రెవెన్యూ అధికారులు తట్టుకోలేకపోతున్నారు. పత్రికలో వార్త ప్రచురితమైతే కథనంలో అవాస్తవాలు ఉంటే ఖండనివ్వాలి లేదా కోర్టును ఆశ్రయించడం లేక ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయడం చేయాలి. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం ఈ నిబంధనలు ఏమీ పాటించకుండా దౌర్జన్యాన్ని ఎంచుకోవడం వారి బరితెగింపునకు నిదర్శనం. పత్రికలో ప్రచురితమైన కథనానికి ఖండన ఇస్తామని కార్యాలయానికి పిలిపించుకొని ఏకంగా దాడి చేయడం విశేషం. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మే 22న వార్త దినపత్రికలో "రెవెన్యూ కార్యాలయాలు ఇలా తగలడ్డాయి" శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎన్నికలు, కౌంటింగ్ సందర్భంగా సుమారు నెలరోజులుగా రెవిన్యూ కార్యాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలో ఎన్నికలు, కౌంటింగ్ జరిగినా ఎప్పుడూ ఈ విధంగా లేదని రెవెన్యూ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడం లేదని ప్రచురించడం జరిగింది. ఈ వార్తకు వాస్తవానికి ఆర్డిఓ కార్యాలయ అధికారులు స్పందించి ఖండన ఇవ్వాల్సి ఉండగా మునగపాక రెవిన్యూ అధికారులు స్పందించడం విశేషం. "మా సార్ మీరు రాసిన వార్తకు ఖండన ఇస్తారు, రమ్మని" మునగపాక విఆర్‌ఓ హిమబిందు పలుమార్లు ఫోన్ చేయడంతో వార్తా స్టాఫ్ రిపోర్టర్ వెంకటేష్ మునగపాక కార్యాలయానికి వెళ్లడం జరిగింది. ఎందుకు సార్ పిలిపించారని తహసీల్దార్‌ను ప్రశ్నించగా తలుపులు మూయండి అని డిప్యూటీ తాసిల్దార్ వినయ్ సిబ్బందిని ఆదేశించారు. చేతిలో కలం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు రాసేస్తారా నీ మీద ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం, సమాధానం చెప్పే వరకు కదలనివ్వం అంటూ దుర్భాషలాడారు. వార్తా కథనంలో తప్పులుంటే ఖండన ఇవ్వాలి కానీ ఇలా దౌర్జన్యం చేయడం తగదని చెబుతున్న వినకుండా వీడియో ఎందుకు తీస్తున్నావ్ అంటూ తాసిల్దార్ పాపారావు మీద పడి చొక్కా పట్టుకొని సెల్ ఫోన్ లాక్కొని దౌర్జన్యం చేశారు. వాస్తవానికి మునగపాక రెవిన్యూ కార్యాలయంలో చాలా అవకతవకులు జరుగుతున్నాయి, ఇవి ఎక్కడ బయటకు వస్తాయో అని రిపోర్టర్ పై బెదిరింపులు దాడులకు తెగబడుతున్నారని వాస్తవానికి ఇప్పటికే లోకాయుక్త కోర్టులో వీరిపై పలు కేసులో ఉన్నాయి. లోకాయుక్తను తప్పుతోవ పట్టించేలా నివేదికలు కూడా సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పత్రికలలో కథనాలు రాయకుండా చేయాలని ఈ రెవిన్యూ అధికారులు అదితెలివి ప్రదర్శించారు. కాగా జర్నలిస్ట్ పై దాడి ఘటనపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేస్తుంది.





## ఫెడరేషన్‌కు పెరుగుతున్న ఆదరణ

అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రోజు రోజుకు జిల్లా అంతటా విస్తరిస్తున్నది. ఇతర యూనియన్లలో ఉన్నవారు కూడా ఫెడరేషన్ కార్యకలాపాలను ఆదరిస్తున్నారు. ఇటీవల కొయ్యూరులో ఇతర యూనియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెందిన జర్నలిస్టులు కొత్తగా సభ్యత్వం తీసుకున్నారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి. ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు వెంకటేష్‌లు వారికి సభ్యత్వం ఇచ్చి ఆహ్వానించారు.




# జర్నలిస్టులపై దాడులకు ఖండన

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల్ని ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు స్పష్టంచేశారు. మే 19వ తేదీ తిరుపతిలోని యశోద నగర్ వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల స్థితిగతుల గురించి ప్రస్తావన చేశారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి శ్రీధర్, కార్యదర్శి వి.గోపి, ఏపీ బీజేఏ నాయకులు మునిరాజ్, ఫెడరేషన్ జిల్లా నాయకులు దినకరన్, శ్రీనివాసులు, జయకుమార్, తులసిరామ్, మల్లెల వాణి, జైపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి. ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టులు చిన్న పెద్ద పత్రికలు, మీడియాలో పనిచేస్తున్నా అందరూ సమానమే అని ఎవరిపై దాడి జరిగినా తమ ముందుండి పోరాడుతామన్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులను విచారించి జరిగిన విషయంపై తప్పొప్పులను తెలుసుకొని న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అలాగే జర్నలిస్టులు ప్రధానంగా ఎదుర్కొంటున్న అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, పెన్షన్ తదితరాలను ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు అందే అందే విధంగా పోరాటం చేయడమే తమ ప్రధాన కర్తవ్యమన్నారు. దీనిపై తగిన కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతామన్నారు. రేపటి నుంచి ఆగస్టు వరకు తమ ఫెడరేషన్ సభ్యత్వాలను పెంచి ఆగస్టులో మహాసభ ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతుందని ఆయన పిలుపుచ్చారు. సమావేశంలో సభ్యులు నరసింహులు, రాధాకృష్ణ గౌడ్, భాస్కర్, సుకుమార్, వెంకటేశ్వరరావు, పాటూరి సురేంద్ర సుధీర్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం తిరుపతి జిల్లాకు తాత్కాలిక అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు అయింది. ఈ కమిటీ తక్షణ కర్తవ్యాలను నిర్దేశించుకున్నది. వెంటనే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సభ్యత్వ చేర్పింపుతో పాటుగా కమిటీలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. జూలై నెలాఖరులోగా ఈ కమిటీల ఏర్పాటును పూర్తిచేసి జిల్లా మహాసభ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన జి.శ్రీధర్‌కు సమావేశం అభినందనలు తెలియజేసింది. ఇకముందు కూడా అడ్‌హాక్ కమిటీ చురుకుగా పనిచేసేందుకు అవసరమైన తోడ్పాటు అందించాలని కోరింది. ఫెడరేషన్‌కు జిల్లాలో ఉన్న విస్తృతమైన సంబంధాల రీత్యా అన్ని నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటునకు ఎక్కువ సమయం పట్టదని, వీలైనంత త్వరితగతిన బాధ్యతలు తీసుకున్నవారు పనిచేయాలని శ్రీధర్ వారికి విజ్ఞప్తి చేస్తూ తన సంపూర్ణ సహకారం అన్నివేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. కమిటీలో యువకుల భాగస్వామ్యం పెరిగింది కనుక కమిటీ పనితీరులో గణనీయమైన మార్పు వస్తుందని ఆశిస్తున్నానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొద్దికాలం పాటు దేశంలో ఉండకపోయినప్పటికీ సలహాలు ఇస్తానని స్పష్టం చేశారు.



# సుందర స్విట్జర్లాండ్

ప్రపంచంలో ఈ దేశం పేరు వినని వారు ఉండరు. కొత్తగా పెళ్ళైయిన యువ దంపతులు ఆ దేశానికి హనీమూన్‌కు వెళ్ళాలని కోరుకుంటారు. ఆ జ్ఞాపకాలను జీవితాంతం గుర్తుపెట్టుకోవచ్చని. భూతల స్వర్గంగా పేరొందిన దేశం. శీతల దేశమైనా ఎక్కడ చూసినా పచ్చని చెట్లు, సెలయేర్లు, మంచుతో కప్పబడిన పర్వత శ్రేణులు, అతి తక్కువ జనాభా, చుట్టుపక్కల ఉన్న అన్నిదేశాలతో చక్కటి సంబంధాలు, సైన్యం లేని దేశం (పేరుకు సైన్యముంది కానీ యుద్ధం చెయ్యడానికి కాదు. రెడ్ క్రాస్ సహాయకులుగా, శాంతి బృందాలుగా పనిచేస్తారు), శత్రువులు లేని దేశం. 18 ఏళ్ళు దాటితే మొగపిల్లలకు నిర్బంధ సైనిక శిక్షణ ఉందా దేశంలో.

స్విట్జర్లాండ్ పేరు వింటే ఆ దేశపు బ్యాంకు వ్యవస్థ గుర్తుకు వస్తుంది. (చాకలెట్స్, చీజ్‌కు కూడా ఆ దేశం ప్రసిద్ధి పొందింది)

ఈ దేశానికి ఇంకో ప్రత్యేకత ఉంది. పౌరులందరూ చదువుకున్న వారే. ప్రభుత్వం ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవాలంటే అది ప్రజాభిప్రాయ ప్రకారమే సాధ్యపడుతుంది. మన దేశంలో చట్టసభల్లో సభ్యుల నిర్ణయమే అంతిమం. అక్కడ అలా కాకుండా దేశప్రజలకు ఉపయోగపడే చట్టాలు "ప్రజాభిప్రాయ సేకరణతోనే సాధ్యం". ఇంకో ముఖ్యవిషయం ఏమిటంటే నిర్బంధ ఓటింగ్ ప్రజాభిప్రాయ సేకరణలో. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తమ హక్కును వినియోగించుకోవాలిసిందే.

మిగతా దేశాల బ్యాంకులకు స్విట్జర్లాండ్ బ్యాంకులకు తేడా ఏమిటి? ఎందుకు అవి అంత ప్రాచుర్యం కలిగి ఉన్నాయి ఒకప్పుడు

ఆ దేశంలో ఉన్న ఎన్నో బ్యాంకుల్లోకి ప్రసిద్ధి పొందింది. "స్విస్ బ్యాంక్" (ఇప్పుడు మారిన పేరుతో అందరికి పరిచయం). రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఈ స్విస్ బాంక్ ఒక కొత్త విధానాన్ని

ప్రారంభించి విపరీతమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. అత్యంత ధనిక దేశం. ఈ దేశం గురించిన ఒక ఆసక్తికరమైన విషయం తెలుసుకుందాం.

ఆక్కడి బ్యాంకుల విధానమేమిటంటే ప్రపంచంలో ఏ దేశ ధనిక పౌరుడైన స్విస్ బ్యాంకులో ఖాతా తెరవచ్చు. వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి.

ఇతర దేశాల "ధనిక" పౌరుడు ఎలా సంపాదించాడు అన్నది ఆ బ్యాంకు అడగదు. ఒక నియంత తన దేశాన్ని దోచుకుని స్విస్ బ్యాంకులో దాచుకోవచ్చు, స్మగ్లర్లు, మాఫియా డాన్లు, మాధకద్రవ్యాల వల్ల సంపాదించినవారు, లంచగొండి రాజకీయ నాయకులు, పన్నులు ఎగ్గొట్టే వ్యాపారస్తులు, మోసపురితంగా సంపాదించిన సొమ్ము, ఇలా ఎవరైనా అక్కడి బ్యాంకులో డబ్బుని మదుపు చెయ్యవచ్చు. రెండే రెండు రూల్స్ మాత్రం వర్తిస్తాయి.

మామూలుగా మనం బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటే బ్యాంక్ మనకు వడ్డీ చెల్లిస్తుంది. కానీ స్విస్ బ్యాంక్ మాత్రం తన ఖాతాదారుల నుంచి రుసుము వసూలుచేస్తుంది. ఖాతాదారులు డబ్బే కాదు, ఖరీదైన వజ్రాలు, బంగారం, బంగారు నగలు, పెయింటింగ్స్, వెలకట్టలేని పురాతన వస్తువులు కూడా అక్కడి వాల్ట్స్ లో భద్రపరుచుకోవచ్చు.

స్విస్ బ్యాంకు ఖాతాదారులకు ఒకే ఒక షరతు విధిస్తుంది. ఇది మొదటి రూల్. ఖాతా తెరిచినప్పుడు ఫోటో, చిరునామా ఏది అడగదు. రీఛార్జి కార్డులా ఖాతాదారునికి అకౌంట్ నెంబర్, పాస్‌వర్డ్ మాత్రం ఇస్తుంది. లాకర్ తీసుకున్న వారికి తాళం చెవి ఇస్తుంది, ఇంకో తాళం తమ దగ్గర ఉంచుకుంటుంది. లాకర్ అంటే మనకు ఇచ్చే లాకర్ సైజ్ నుంచి, కావాలంటే ఒక పెద్ద గది అంత లాకర్ కూడా అద్దెకు ఇస్తారు. ఖాతాదారుల దాచుకునే వస్తువులను బట్టి లాకర్ పరిణామం. ఈ లాకర్స్ అవి కూడా భూమిలో నాలుగైదు అంతస్తుల కింద ఉంటాయి పటిష్టమైన భద్రతతో. ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ఆ లాకర్స్ దొంగలు దోచుకోలేకపోయారు అంటే ఊహించుకోవచ్చు ఎన్ని రకాల భద్రతా వలయాలు ఉన్నాయో.

బ్యాంకు ఖాతాదారుని గుర్తుపెట్టుకోదు. అకౌంట్ నెంబర్, పాస్‌వర్డ్ చెప్పిన వ్యక్తికి ఖాతా నుంచి డబ్బులు తీసుకునే సౌకర్యం ఉంది. అలాగే ఆ రెండూ చెప్పి లాకర్ తాళం చెవి చూపిస్తే లాకర్ తెరిచే సౌలభ్యం ఏర్పరిచింది.

ఇంకొక రూలు ఏమిటంటే ఖాతాలో ఎంత మొత్తం అయినా ఉండనివ్వండి, లేదా లాకర్స్‌లో ఎంత విలువైన సామాగ్రి అయినా ఉండనివ్వండి. బ్యాంకు నిర్ణయించిన కాల పరిమితి లోపు ఖాతాను వాడకపోతే, అంటే ఒక పదేళ్లు లేదా ఇరవై ఏళ్ళ కాలం కావచ్చు, అప్పుడు ఆ ఖాతాను జప్తు చేసి అందులో ఉన్న మొత్తాన్ని ప్రభుత్వానికి అందచేస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో ప్రపంచంలో అత్యంత ధనవంతులు యూదులు. జర్మనీ , పోలాండ్, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇంగ్లండ్, లక్సంబర్గ్ , నెదర్లాండ్స్ తదితర దేశాల యూదులే కాకుండా అమెరికాలో ఉన్న యూదులు కూడా ఈ బ్యాంకులో లెక్కపెట్టలేనంత డబ్బులు, బంగారం, వజ్రాలు, పెయింటింగ్స్ , కళాఖండాలు దాచుకున్నారు. అదంతా వారి కష్టార్జితం.

వీరే కాకుండా జర్మనీకి చెందిన నాజీ ఉన్నతాధికారులు, సైన్యాధికారులు యూదుల నుంచి కొల్లకొట్టిన కళాఖండాలు, బంగారం, నగదు దాచుకున్నారు.

యుద్ధానంతరం యూదులు, అధికారులు, సైన్యాధికారులు చాలామంది తిరిగి రాలేదు తమ సొమ్ముని తీసుకోవడానికి.

ఆ తరువాతి సంవత్సరాల్లో వివిధ దేశాధినేతలు, నియంతలు, మాఫియా డాన్‌లు, మాధకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, ఇతరులు తన అక్రమార్జనను ఈ బ్యాంకులో దాచుకొని తిరిగి రానివారున్నారు.

ఆ విధంగా విపరీతంగా ధన నిలువలు పేరుకుపోయాయి. లాకర్స్ ఎన్నో ఏళ్లుగా తెరవకుండా పడి ఉన్నాయి.

కొత్త శతాబ్ది ప్రారంభంలో అంటే 2000 సంవత్సరంలో ఇది జరిగింది.

అటువంటి పరిస్థితుల్లో ఒక సుముహూర్తాన అటువంటి ఖాతాలు అన్నిటికీ నోటీసులు ఇచ్చి నిర్ణీత సమయానికి ఎవరూ రాకపోతే ఆ ఖాతాలు జప్తు చేయబడ్డాయి. చేసిన ఖాతా లోంచి స్వాధీనం చేసుకున్న సొమ్ముని ప్రభుత్వ ఖజానాకు తరలించడం జరిగింది.

అలా ప్రభుత్వ ఖజానాకు వచ్చిన మొత్తం ప్రపంచంలోని నల్లధనంలో నలభై శాతం.

ప్రభుత్వం ఆయాచితంగా వచ్చిన సొమ్ముని ఎలా ఉపయోగించుకోవాలో అర్థం కాక ప్రజాభిప్రాయం తెలుసుకుందాం అని తమ దగ్గర ఉన్న సొమ్ము ప్రతి పౌరునికి పంచితే ఒక మిలియన్ యూరోలు పైనే ముట్టుతాయి, లేదా ఏ రకంగా దేశ అభివృద్ధికి ఖర్చుపెట్టవచ్చో చెప్పండి మీ అభిప్రాయాన్ని అని వోటింగ్ నిర్వర్తించింది.

పదిహేను రోజుల సర్వే తరువాత 99.2% శాతం ప్రజలు, దేశ సుందరీకరణకు, తమ దేశాన్ని చూడడానికి వచ్చే యాత్రికుల

సౌకర్యాలకు, టూరిజం అభివృద్ధికి ఖర్చుపెట్టాలి అని అభిప్రాయపడ్డారు.

దేశాభిమానులైన స్విట్జర్లాండ్ ప్రజలకు ఇదో పెద్ద విషయంలా అనిపించలేదు. ప్రతి పౌరునికి మిలియన్ యూరోలు ఉచితంగా ఇస్తామనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశ సౌభాగ్యానికి ఆ దేశ ప్రజలు ఓటు వేశారంటే, మిగతా దేశ పౌరులకు ఆశ్చర్యం కలగవచ్చు.

ఆ దేశ పౌరుల నిశ్చిత అభిప్రాయం ఏమిటంటే ఎందరో ఎన్నో విధాలుగా అన్యాక్రాంతంగా సంపాదించింది, అమాయకుల నుంచి కొల్లగొట్టి దాచుకున్న సొమ్ము తమకు ఉచితంగా ఇచ్చినా వద్దు అనేది 99.2% ప్రజల స్థిర అభిప్రాయం.

ఇక్కడ ఇంకో తమాషా జరిగింది.

2000 జనవరి 25వ తారీఖు ప్రజలు ప్రభుత్వ సర్వే ఆఫీసు ముందర బారులు తీరారు చేతిలో బ్యానర్స్ పట్టుకొని.

ఆ గుమిగూడిన ప్రజల డిమాండ్ ఏమిటంటే, ప్రభుత్వం ఇవ్వదలుచుకున్న ఉచిత ఒక మిలియన్ యూరోలు కోసం ఆశ పడి అందుకోసం ఓటు వేసిన 0.8% ప్రజల పేర్లు బహిర్గతం చేయాలని వారి కోరిక.

ఈ 99.2 శాతం ప్రజల అభిప్రాయం ప్రకారం ఉచిత సొమ్ముని ఆశపడిన ఆ 0.08 శాతం ప్రజలు దేశానికి మచ్చ తెచ్చారు, వారి పేర్లు బహిర్గతం చేస్తే మిగతా పౌరులు అటువంటి చీడపురుగులకు దూరంగా ఉంటాము అన్నది వారి అభిప్రాయం.

ప్రభుత్వ ప్రతినిధులతో చాలాసేపు జరిగిన సంప్రదింపులతో ఒక ఒప్పందం కుదిరింది. ప్రభుత్వం వారి పేర్లు బయట పెట్టదు. కానీ వారిని తగురీతిలో శిక్షిస్తుంది అని ప్రభుత్వం చెప్పడంతో వారు శాంతించారు.


ఉచితాలు వద్దు అని 99.2 శాతం ప్రజలు ఏకాభిప్రాయం వ్యక్తపరిచారు అంటే, ఎంత తేడా మిగతా దేశ ప్రజలకు స్విట్జర్లాండ్ ప్రజలకు!?

మనదేశంలో ఐతే ఉచితాలకు చచ్చిన వాడుకూడా లేచి వస్తాడు.




# జర్నలిస్ట్ కుటుంబానికి అండగా.....


కష్టాల్లో ఉన్న జర్నలిస్టుల కుటుంబాలకు ఆదుకునేందుకు సంఘంగా జర్నలిస్టులే ముందుకు రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చింతలపూడిలో ఆకస్మికంగా చనిపోయిన సీనియర్ జర్నలిస్టు అశోక్ వర్ధన్ కుటుంబాన్ని అదుకోవాలని జిల్లాలోని జర్నలిస్టులకు ఫెడరేషన్ పిలుపిచ్చిన వెంటనే మంచి స్పందన లభించింది. జర్నలిస్టులతో పాటుగా స్థానికంగా ఉన్న రాజకీయ నాయకులు కూడా స్పందించి తమ వంతు సహకారాన్ని అందజేసి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఏలూరు టైమ్స్ సీనియర్ జర్నలిస్ట్ అశోకవర్ధన్ మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు అండగా ఏలూరు జిల్లాలోని జర్నలిస్టులు నిలిచారు. చింతలపూడి ప్రజాశక్తి రిపోర్టర్ సారథ్యంలో అశోక్ వర్ధన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించమని కోరగానే ఎంతోమంది సహృదయంతో తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. సహాయం అందించిన వారందరి తరపున 33100 రూపాయలను అశోక్ వర్ధన్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. అలాగే జనసేన పార్టీ చింతలపూడి మండల పార్టీ ప్రెసిడెంట్ చిదరాల మధు బాబు, నాయకులు కార్యకర్తలు తమ వంతు సహాయంగా 11 వేల రూపాయలు అందించారు. అశోక్ వర్ధన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా రాబోయే రోజుల్లో వారికి ఎలాంటి సమస్య వచ్చిన వేమున్నామంటూ అశోక్ కుటుంబసభ్యులకు ధైర్యాన్ని చెప్పారు.




30th April, 2024 a sad day for the book readers.. THE READERS DIGEST has been closed. Following is that sad news along with a symbolic video presentation, which appeared with a note by the its editor in chief also on International Book Day. Some of the images are fabulous.End of an era As of April 30, 2024, Reader's Digest UK has ceased publishing its print edition after 86 years. The magazine's editor-in-chief, Eva Mackevic, announced on LinkedIn that the company was unable to withstand the financial pressures of the current magazine publishing landscape. The May 2024 issue was the last published. ??



The most intelligent group photo ever. Participants of 5th solvey conference on Quantum Mechanics, 1927. Albert Einstein, Marie S Curie, Niels Bohr and others. 28 out of the 29 in this picture are Nobel Prize Winners. Great photo .. also it is great to see such a good quality of photograph taken in 1927 when technology was not so advanced .



Sigmund Freud, Father of Psychology arrived in London on 6.6.1938, fleeing the Nazi annexation of Austria. Sigmund Schlomo Freud was an Austrian neurologist and founder of psychoanalysis, a clinical method of treating the patients with dialogue between the patient and the psychoanalyst. His theories on unconscious mind, dreams and the importance of sexuality in human development shaped modern psychology. He wrote many books on this subject. Freud's ideas left an indelible mark on the study of the human mind and modern psychology. Freud died on 23.9.1939, at 83, from cancer.

# జర్నలిస్టులపై దాడులకు ఖండన

తిరుపతిలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జర్నలిస్టులపై మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో లాఠీచార్జ్‌కి కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, రిపోర్టర్ నరేంద్రపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కోరుతోంది. తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. తిరుపతిలోని జర్నలిస్టులు ఉమామహేశ్వరరావు, నరేంద్రల పేర్లు ప్రస్తావిస్తూ ఆయన చేసిన ఆరోపణలు ఎంత మాత్రం సమంజసమైనవి కావని ఫెడరేషన్ భావిస్తోంది. మీడియాలో వచ్చిన వార్తల్లో తప్పులుంటే, పొరపాట్లు ఉంటే వాటిపై వివరణ ఇవ్వాలి. అవి తీవ్రమైనవని భావిస్తే కోర్టుకు కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. అందుకు భిన్నంగా ఏమాత్రం సంబంధం లేని విధంగా ఆరోపణలు చేయడం వారిని కబ్జాదారులు అని వ్యాఖ్యానించడం ఎంత మాత్రం సరికాదని ఫెడరేషన్ భావిస్తోంది. రాజకీయ నాయకులుగా విజ్ఞతతో వ్యవహరించాల్సిన వారు భిన్నంగా వ్యవహరించడం సరికాదని అటువంటి వైఖరిని విడనాడాలని విజ్ఞప్తి చేస్తోంది.

# వైద్య విద్య కోసమైతే చలో కిర్గిస్తాన్




కె.మంజరి

**నీట్ పాస్ అయితే చాలు**
**35 లక్షలకే ఎంబిబిఎస్**
**ఎఫ్ఎంజిఈ శిక్షణ కూడా**

**భా**రత దేశంలో మెడిసిన్‌లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే నీట్‌కు హాజరయ్యే వాళ్ళ సంఖ్య 20 లక్షలకు పై మాటే. కానీ దేశంలో ఉన్న సీట్లు లక్షకు మించవు. దాంతో డాక్టర్లు కావాలనుకునే లక్షలాదిమంది విద్యార్థుల కలగానే మిగిలిపోతుంది. నీట్‌లో అర్హత సాధించినా ఫ్రీ సీటు వచ్చేది కొద్ది మందికే. మిగిలిన వారు దాదాపు కోటి రూపాయలను వెచ్చిస్తే కానీ మెడిసిన్ చదివే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మెడిసిన్ విద్య కోసం తమ పిల్లలను విదేశాలకు పంపేందుకు కూడా తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. అలాంటి తల్లిదండ్రులకు అంది వచ్చిన వరం కిర్గిస్తాన్.

**బాసటగా ఐఎస్ఎమ్ ఎడ్యుటెక్**

మధ్యాసియా దేశమైన కిర్గిస్తాన్, గతంలో సోవియట్ యూనియన్‌లో ఓ రిపబ్లిక్‌గా ఉండేది. ఆ సమయంలో వైద్య విద్యకు ప్రాధాన్యతనిస్తూ వివిధ రిపబ్లిక్‌లలో వైద్య కళాశాలలను సోవియట్ స్థాపించింది. ఆ కాలంలో డజన్లకొద్దీ భారతీయులు వైద్య విద్యను అభ్యసించారు. అయితే వారంతా ముందుగా రష్యన్ నేర్చుకొని ఆ మాధ్యమాలలోనే మెడిసిన్ పూర్తి చేయవలసి వచ్చేది. కోర్సు పూర్తి చేయడానికి ఏడేళ్లు పట్టేది. సోవియట్ విచ్చిన్నమై స్వతంత్ర దేశాలుగా రిపబ్లిక్స్ అవతరించినా 2000 సంవత్సరం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. అలా ఓ రిపబ్లిక్ లో మెడిసిన్ చదివిన వారే కొత్తగూడెంకు చెందిన డాక్టర్ పి ఫణి భూషణ్. తోటి భారతీయ విద్యార్థులు ఖర్చు భరించలేక వైద్య విద్యను అభ్యసించలేని పరిస్థితిని చూసి చలించిన డాక్టర్ పి ఫణి భూషణ్ వాళ్ళ కోసం ఏమైనా చేయాలనే ఆలోచనతో ఉండగా, స్వతంత్ర దేశంగా ఏర్పడి ఆర్థికంగా ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న కిర్గిస్తాన్ ప్రభుత్వం ప్రైవేటు వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతినివ్వాలని భావించింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న డాక్టర్ ఫణి భూషణ్ కిర్గిస్ రాజధాని బిష్కేక్‌లో ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఐహెచ్ఎస్ఎం)ను 2003లో స్థాపించారు. మధ్యాసియాలోనే ఇంగ్లీష్ మీడియంలో మెడికల్ డిగ్రీను ప్రవేశ పెట్టడం ఇదే ప్రథమం. సోబియెట్ కాలంలో 1939 లోనే బిష్కేక్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో కిర్గిస్ స్టేట్ మెడికల్ అకాడమీ (కిఎస్ఎంఎ) ఉండనే ఉంది. ఐ.ఎస్ హెచ్ఎం కు వస్తున్న ప్రతిస్పందన చూసి కె ఎస్ ఎం ఎ అకాడమీ కూడా ఇంగ్లీష్ మీడియంలో తరగతుల నిర్వహణకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వాలని భావించి టెండర్లు ఆహ్వానించింది.

డాక్టర్ ఫణి భూషణ్ ఆధ్వర్యంలోని ఐ ఎస్ ఎం ఎడ్యుటెక్‌కు ఆ అవకాశం దక్కింది. ఇంగ్లీష్ మీడియంలో భారతీయ సిలబస్‌లో వైద్య విద్యను అదీ చౌకగా అందించేందుకు



ఎడ్యుటెక్ పూనుకుంది. అంతకుముందు కిర్గిస్తాన్ వచ్చే విద్యార్థుల సంఖ్య పదులలో ఉంటే నేడు అది వందలకు చేరుకుంది. ప్రస్తుతం 2000 మందికి పైగా తెలుగు విద్యార్థులు ఈ దేశంలో మెడిసిన్ చదువుతున్నారు. ఐదున్నర ఏళ్ళ ఎంబిబిఎస్ కోర్సులో ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. దాంతోపాటు భారత్‌లో గుర్తింపు పొందేందుకు నిర్వహించే ఫారిన్ మెడిసిన్

గ్రాడ్యుయేట్ ఎలిజిబిలిటీ పరీక్షకు అవసరమైన శిక్షణ కూడా అదీ భారతీయ అధ్యాపకుల ఆధ్వర్యంలోనే ఇప్పిస్తున్నారు.

**సమస్త సదుపాయాలు**

విద్యార్థుల ప్రవేశాలు, వారి కోర్సుకు సంబంధించిన అంశాలనే కాకుండా హాస్టల్ నిర్వహించే బాధ్యత కూడా ఐఎస్ఎ ఎడ్యుటెక్‌దే. పరాయి దేశంలో అలవాటు లేని తిండి తినాల్సిన, తిని అవస్థలు పడాల్సిన పరిస్థితి ఈ సంస్థ ద్వారా చదివే విద్యార్థులకు లేదు. రోటి, అన్నంతో పాటు అన్ని భారతీయ వంటకాలని హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్నామని ఎడ్యుటెక్ కోఆర్డినేటర్ అత్తలూరి రామకృష్ణ తెలిపారు. బియ్యం, పప్పులని భారతదేశం నుంచి దిగుమతి చేసుకుంటామని సాగుకు అనుకూలమైన సమయంలో స్థానిక రైతుల సాయంతో బీర, సొర, చిక్కుడు, బెండ లాంటి కూరగాయలను పండిస్తున్నామని చెప్పారు. అందువల్ల ఆహారం విషయంలో విద్యార్థులు ఎవరూ ఇంటిని మిస్ అవ్వరు. ఆరోగ్య పరిరక్షణకు అన్నివేళలా అందుబాటులో వైద్య సిబ్బంది ఉంటారు. ఏమైనా అనారోగ్యం వచ్చి విద్యార్థులు ఎవరైనా ఇంటికి వెళ్లాలని భావిస్తే తమకున్న సొంత విమానం ద్వారా స్వదేశం పంపిస్తామని తెలిపారు. ఏ క్యాంపస్ లోనూ ర్యాగింగ్ లేదు, అనుమతించమని చెప్పారు. 24 గంటలు సెక్యూరిటీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. ప్రభుత్వ కేఎస్ఎమ్ మొదటి సంవత్సర విద్యార్థుల కోసం బిష్కెక్ శివారులలో ప్రత్యేక క్యాంపస్ ఉందని చెప్పారు.

క్రీడలు శారీరక వ్యాయామం సిలబస్‌లో అంతర్భాగం. వాటికి కూడా మార్కులు ఉంటాయి. స్థానికంగా ఇబ్బంది లేకుండా ఉండేందుకు కిర్గిజ్, రష్యన్ భాషలను మెడికల్ పదాలను అర్థం చేసుకునేందుకు లాటిన్ భాషను కూడా ఇక్కడ బోధిస్తున్నారు.

**మహిళలకు అత్యంత సురక్షితం**

మనదేశంలో ఆడపిల్లలు బయటికి వెళ్లాలంటే తోడుగా ఎవరూ లేకుండా పంపడానికి భయపడతాం. కానీ బయటికి వెళ్లేటప్పుడు ఆడపిల్లను తోడు తీసుకెళ్తే భద్రంగా ఫీల్ అవుతామని చదువుతున్న భారతీయ విద్యార్థులు చెప్పారు. అదేమిటంటే స్థానిక భాష రాకపోవడం వల్ల ఏదైనా అపార్థం చోటు చేసుకున్నా తమ వెంట ఆడవారు ఉంటే స్థానికులు ఏమీ అనరు అని తెలిపారు. స్త్రీలకు ఎంతో గౌరవం ఇచ్చే దేశమని, అత్యంత సురక్షితమని ఏ సమయంలో బయటకు వెళ్లిన భయం ఉండదని చెప్పారు. ఇవన్నీ వింటుంటే అర్ధరాత్రి కూడా మహిళ ఒంటరిగా స్వేచ్ఛగా బయట తిరగ గలిగినప్పుడే నిజమైన స్వాతంత్రం అన్న మన జాతిపిత గాంధీజీ మాటలు గుర్తొచ్చాయి. సో తమ కుమార్తెలను వైద్య విద్య కోసం కిర్గిజ్‌కు పంపడానికి తల్లిదండ్రులు ఏమాత్రం సందేహించనక్కర్లేదు.

ఎంతో ప్రశాంతంగా ఎటువంటి రణగొణ ధ్వనులు లేని ఇక్కడ చదువుకోవడం తమకు ఎంతో బాగుందని, చదువుపై ఏకాగ్రతకు అన్ని రకాల వీలుగా ఉందని కిర్గిజ్‌లో చదువుతున్న విద్యార్థులు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ కనిపించారు. ఆహారం, వసతితో సహా ఈ ఐదున్నర ఏళ్ల విద్యా కాలానికి దాదాపు 35 లక్షల రూపాయలు ఖర్చవుతాయని ఇది తమలాంటి మధ్యతరగతి వారికి ఎంతో సౌలభ్యంగా ఉందని వారంతా ముక్తకంఠంతో చెప్పారు.

**అతిపెద్ద అనాటమీ ల్యాబ్**

బిష్కెక్‌లో డాక్టర్ అఖునేవ్ కిర్గిజ్ మెడికల్ అకాడమీ కెఎస్ఎంకు అనుబంధంగా ఉన్న అనాటమీ ల్యాబ్ ఆసియాలోనే రెండవ అతిపెద్దది. ఈ వర్సిటీలో చదివే వారికే కాకుండా పరిశోధన నిమిత్తం వివిధ దేశాలకు చెందిన వారు కూడా ఇక్కడికి వస్తుంటారు. అమెరికా, జర్మనీ, టర్కీ దేశాల నుంచి కూడా ఇక్కడ ఈ పరిశోధన విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కావాల్సిన అత్యాధునిక సౌకర్యాలు అన్నీ ఈ విద్యాసంస్థలో ఉన్నాయి. వైద్య విద్యార్థుల క్లినికల్ అనుభవం కోసం 'వేదాంత' పేరుతో ఆసుపత్రులను కూడా నిర్వహిస్తోంది.







## విశాలాంధ్ర విలేకరి రాము మృతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కామవరపుకోట మండల విశాలాంధ్ర విలేకరి టి. రామకృష్ణ (రాము) అనారోగ్యంతో జూన్ 7వ తేదీ మృతి చెందారు. అనారోగ్యం పాలైన ఆయనను చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కన్నుముశారు. రామకృష్ణ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జబీర్, హరీష్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రామకృష్ణ కుటుంబసభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

## సీనియర్ జర్నలిస్టు సుదర్శన్ కన్నుమూత



సీనియర్ జర్నలిస్ట్ గెద్దాడ సుదర్శన్ జూన్ 11 తెల్లవారుజామున అకాల మరణం చెందారు. ఆయన వివిధ పత్రికలు, ఛానళ్లలో జర్నలిస్టుగా పనిచేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ సంఘంలో చురుకుగా ఉండే సుదర్శన రావు ఇటీవల అనారోగ్యంతో ఇబ్బంది పడ్డారు. కాజులూరు మండలం చేదువాడ గ్రామానికి చెందిన సుదర్శన్ వయసు 55 సంవత్సరాలు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఎవరికీ వివాహం కాలేదు. ఆయన 28 సంవత్సరాలుగా ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. తాను పనిచేసిన ప్రతి సంస్థలో క్రమశిక్షణ, అంకితభావంతో వృత్తిలో కొనసాగారు. ఎటువంటి సమస్య ఎదురుకాలేదు. ఫెడరేషన్ కార్యకలాపాల్లో కూడా అదే స్ఫూర్తితో పనిచేసేవారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే నియోజకవర్గంలోని ఎమ్మెల్యే సుభాష్ తండ్రితో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు వచ్చి సంతాపం తెలియజేశారు. ఫెడరేషన్ జిల్లా నాయకులతో పాటు సాటి జర్నలిస్టు మిత్రులు సుదర్శన్ రావు మృతికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు కాకినాడ జిల్లా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.నవీన్‌రాజ్, ఎం.లక్ష్మణ్‌లు ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అన్నివేళలా అండగా నిలబడి తోడుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలోని ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టు మిత్రులు కె.కనకరత్నం, కార్యదర్శి పృధ్వీరాజు, భీమశంకరం, చందాల బాబీ, ఫెడరేషన్ నాయకులు జి.మల్లేశ్వరరావు, సత్య, ధర్మరాజు, నానాజీ, బాబీ తదితరులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

## జర్నలిస్టు అశోక్ మృతి



సీనియర్ జర్నలిస్ట్ ప్రజాశక్తి, ఏలూరు టైమ్స్ చింతలపూడి రిపోర్టర్ ప్రతి ఒక్కరినీ అన్నా, తమ్ముడు అని పలకరించే అశోక్ వర్ధన్ మే 18వ తేదీ తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వివిధ పత్రికలలో పనిచేసి అందరి మన్ననలు పొందారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ, చింతలపూడి నియోజకవర్గ కమిటీ ప్రగాడ సంతాపం తెలియజేశాయి. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు జిల్లాలోని జర్నలిస్టులు మొత్తం తోడుగా నిలవాలని విజ్ఞప్తి చేశాయి.



# ప్రముఖ పాత్రికేయుడు బి.ఆర్.పి. భాస్కర్ కన్నుమూత

ప్రముఖ పాత్రికేయుడు మానవ హక్కుల కార్యకర్త బి.ఆర్.పి. భాస్కర్ జూన్ 4వ తేదీ ఉదయం తిరువనంతపురంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 92. దాదాపు ఏడు దశాబ్దాల వృత్తి జీవితంలో బాబూ రాజేంద్ర ప్రసాద్ భాస్కర్ ది హిందూ, ది స్టేట్స్‌మన్, పేట్రియాట్, డెక్కన్ హెరాల్డ్ యుఎన్‌ఐలతో పనిచేశారు. ఆ సమయంలోని ప్రధాన పరిణామాలను నివేదించారు.

బాబూ రాజేంద్ర ప్రసాద్ భాస్కర్ చెన్నైలోని ది హిందూలో సబ్-ఎడిటర్‌గా చేరినప్పటి నుండి ప్రారంభమైన తన సుదీర్ఘమైన జర్నలిస్టు వృత్తిలో కేరళ ప్రభుత్వ స్వదేశాభిమాని-కేసరి అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకున్నారు. ది స్టేట్స్‌మన్ పేట్రియాట్‌లో పనిచేసిన తర్వాత, ఆయన యుఎన్‌ఐలో చేరారు. ఆసియానెట్ క్రియాశీలంగా పనిచేయడంలో తనవంతు పాత్ర నిర్వహించారు.

**సామాజిక సమస్యలు**

ఆయన అనేక మలయాళం, ఆంగ్ల ప్రచురణలకు కాలమిస్ట్. ఆయన తన రచనలు, ప్రసంగాల ద్వారా చివరి వరకు అనేక సామాజిక సమస్యలలో పాలు పంచుకున్నారు. ఆయన రచన 'న్యూస్‌రూమ్', ఒక వారపత్రికలో మొదటిసారిగా ప్రచురితమైన ఆయన అనుభవాల సారం. 2023లో ఆయన రచనకు 2023 కేరళ సాహిత్య అకాడమీ అవార్డును పొందారు.

అందరూ అభిమానంతో బాబు అని పిలిచే భాస్కర్ 1932లో తిరువనంతపురం జిల్లాలోని కైక్కరలో జన్మించారు. ఆయన తండ్రి ఎ.కె. భాస్కర్ ఎజవా నాయకుడు, నవభారతం వార్తాపత్రిక యజమాని. జర్నలిజంతో ఆయనకు అనురక్తి, ఆసక్తి, అనుబంధాన్ని పెంచింది.

అతని భార్య రమ అతని కంటే ముందుంది. ఏషియన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో జర్నలిస్ట్, ప్రొఫెసర్. ఆయన కుమార్తె బిందు 2019లో క్యాన్సర్‌తో మరణించింది.

**సంతాపం**

భాస్కర్ మృతి పట్ల గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సోషల్ మీడియా పోస్ట్‌లో సంతాపం తెలిపారు. "అతను నైతికత, వృత్తి నైపుణ్యం ప్రజాస్వామ్య ఆదర్శాల పట్ల లోతైన నిబద్ధతతో జాతీయ మీడియా రంగాన్ని సుసంపన్నం చేశాడు. మలయాళ టీవీ ప్రారంభ సంవత్సరాల్లో అతని మార్గదర్శక పాత్ర చిరస్మరణీయమైనది.

భాస్కర్‌కు సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి పినరయి విజయన్, జర్నలిస్టుగా ఆంగ్లం, మలయాళంలో లెక్కలేనన్ని రచనలు చేశారని అన్నారు. మీడియా స్టడీస్‌లో అతని రచనలు చెప్పుకోదగ్గవి.

ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.కె.పాండే, ఎన్.కొండయ్య, ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. జర్నలిస్టుగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఢిల్లీలో పనిచేసిన కాలంలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు (డి.యు.జె) ఉపాధ్యక్షులుగా పనిచేశారు. జర్నలిస్టు సంఘంలో క్రియాశీల పాత్ర నిర్వహించిన భాస్కర్ లోటు ఎవరూ తీర్చలేనిదని ఆయనకు నివాళు లర్పించారు.

# ఆంధ్రప్రదేశ్ నూతన మంత్రివర్గం

